క్లుప్తంగా

సమాచార హక్కు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేవానంద్



తెనాలిటౌన్: సమాచార హక్కు సంఘం(స్వతంత్ర) జాతీయ ప్రధాన కార్యదర్శిగా రూరల్ మండలం కంచర్లపాలేనికి గ్రామానికి చెందిన కఠెవరపు దేవానంద్(దేవయ్య) నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు కనపర్తి వీరేంద్ర నుంచి సోమవారం ఆదేశాలు అందినట్లు దేవానంద్ మంగళవారం తెలిపారు. జైభీమ్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవానంద్ పనిచేస్తున్నారు.

నేడు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

కొల్లిపర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం నిర్వహించనున్నట్లు చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ కుర్రా సుజాత కోరారు. 13వ వార్డు చినరావూరులోని కమ్యూనిటీ హాల్‌లో జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి ఎవరికి ఏ వ్యాధులు ఉన్నాయో తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. వ్యాధులతో బాధపడే వారికి స్పెషలిస్ట్ వైద్యులు చికిత్స అందిస్తారని చెప్పారు. సమావేశంలో ఎంఎల్‌ఓ చెన్న కేశవులు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి పాల్గొన్నారు.

27న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలి: ఈనెల 27వ తేదీ డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ రీజినల్ ఆఫీస్, విజయవాడ వారి ఉత్తర్వుల ప్రకారం పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆ రోజున సాయంత్రం 4 గంటల వరకు ఫిర్యాదు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీలోగా తమ ఫిర్యాదులను లెటరు ద్వారా తెనాలి కొత్తపేటలోని తమ కార్యాలయానికి పంపాలని కోరారు. కవరుపై డాక్ అదాలత్ అని రాసి పంపించాలని వివరించారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ



తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు ప్రారంభించారు. సంస్థ కో–ఆర్డినేటర్ జి.వెంకయ్య మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయకూడదని, బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో రాఘవ, మహిళా సంరక్షణ కార్యదర్శి హిందూ, ఏఎన్ఎం ఉమ, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రిక, అంగన్‌వాడీ కార్యకర్త అనూష పాల్గొన్నారు.

మార్కెట్‌లో వ్యర్థాలు తొలగింపు

తెనాలి అర్బన్: ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ సోమవారం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా మున్సిపల్ మార్కెట్ వద్ద వ్యాపారులు విక్రయించి వదిలేసిన పత్రిని తొలగించారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఆకురాతి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పండుగ రోజు కూడా విధులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు దావులూరి శ్రీనివాసరావు, పి.అనుపమ, గుమ్మడి ప్రసాద్, ఎం.సుబ్బారావు, షేక్ బాజీహుస్సేన్, వై.లక్ష్మీనారాయణ, సెక్రెటరీలు ఏ ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు



కొలకలూరు సమీపంలోని బ్రిక్స్ కంపెనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు

తెనాలిటౌన్: వినాయక చవితి వేడుకలను ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ, రూరల్ గ్రామాల్లోని పలు సెంటర్‌లలో వినాయకు విగ్రహాలను ఏర్పాటు చేసి విశేషంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేక పందిళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ అలంకరణ చేశారు. రూరల్ మండలం కొలకలూరు సమీపంలోని బ్రిక్స్ కంపెనీలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, జయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. తెనాలి– విజయవాడ రోడ్డులో వీఎస్సార్ కాలేజ్ ఎదురు భారీ గణేష్ విగ్రహం వద్ద భక్తులు విశేష పూజలు జరిపారు. నందులపేటలోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. చెంచుపేటలో గణేష్‌యూత్, ఆటోనగర్‌లో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలాజీరావుపేటలో, చెంచుపేటలో, ఇస్లాంపేటలో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద విశేషంగా పూజలు జరిపారు. బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో వినాయక చవితి వేడుకలను జరిపారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు.

జై గణేష్ మహరాజ్‌కీ

కొల్లిపర: గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వినాయక చవితి పండుగను పుస్కరించుకొని మండలంలోని కొల్లిపర, తూములూరు, అత్తోట, మున్నంగి, వల్లభాపురం, చక్రాయపాలెం ఆయా గ్రామాల్లో భక్తులు మట్టి వినాయ విగ్రహాలు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు చేశారు. గ్రామంలోని పశువుల వైద్యశాల వద్ద భక్తులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ వద్ద ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు చేశారు. వినాయకుని నిమజ్జనం కోసం తూములూరు గ్రామంలో ఈమని హరికోటిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ట్రాక్టర్ నడుపుతూ ఊరేగింపులో పాల్గొన్నారు.



ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న చిన్నారులు



ఆటోనగర్‌లో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న నిర్వాహకులు



తూములూరు.. ఊరేగింపులో భాగంగా వినాయకు విగ్రహం ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే శివకుమార్



చెంచుపేటలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు

ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: ఆర్థిక అసమానతలు తగ్గించడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం పదో రోజు నిర్వహించారు. పార్టీ నాయకుడు ప్రసాదం సురేష్ ఆధ్వర్యంలో కొమ్మమూరు కాలువ వద్ద నుంచి ఎస్టీ కాలనీ వరకు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఎస్టీ కాలనీలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. పింఛన్‌లు పంపిణీ వలన వికలాంగులు, వృద్ధులు, వితంతువులు ఆనందంగా ఉన్నారని చెప్పారు. చేతి వృత్తులు చేసుకునే వారు, చిరువ్యాపారులకు చేయూత, ఆసరా పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు చెక్కా సీతమ్మ, కాలిశెట్టి ఫణీకుమార్, నాగదేవిక, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, సొసైటీ చైర్మన్ గంపల పెద్దబ్బాయి, పార్టీ నాయకులు ప్రసాదం సురేష్‌కుమార్, మల్లవరపు బుల్లయ్య, విజయ్‌కుమార్(బాబీ), పినపాటి అనిల్, కోడూరి రమేష్, కొలకలూరు నాగేశ్వరరావు, పోలిశెట్టి కోటేశ్వరరావు, పామర్తి సుబ్బారావు, నల్లూరు సుమతీ, ధూళ్ళ శ్రీనివాసరావు, కార్తికేయ, షేక్ జానీ, అవుతు నగేష్‌రెడ్డి, మహంకాళి, తెల్లమేకల శ్రీను, అంకమ్మరావు, కమాదుల ఆనంద్, నల్లబోతుల ఆంజనేయులు, జయరాజ్, కమాదుల శ్రీనివాసరావు, ప్రసాదం తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి కె.రామసుబ్బారావు, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.75 వేల చెక్కును ప్రసాదం నాగప్రసాద్‌కు అందజేశారు.

రక్షణ సైన్యం చర్చి వార్షికోత్సవం



తెనాలిఅర్బన్: రక్షణ సైన్యం చర్చి వార్షికోత్సవం మంగళవారం ఐతానగర్‌లోని చర్చి ఆవరణలో నిర్వహించారు. జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరి మేజర్ నాగరాజు మాట్లాడుతూ 1882 సెప్టెంబర్ 19న రక్షణ సైన్యం సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేజర్ రత్నసుందరీ, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవి, కనకరత్నం, నరసింహారావు, ఆశీర్వాదం, ఆనంద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు నూతక్కి విద్యార్థులు ఎంపిక



మంగళగిరి: కృష్ణా జిల్లా నలంద నికేతన్ ఆవరణలో ఈనెల 14,15 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్– 15 ఫుట్‌బాల్ పోటీల్లో నూతక్కిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కె రజనినాయక్ తెలిపారు. పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు శావ ప్రభాకర్, జానాల భరత్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా మంగళవారం పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

పేదల ఇళ్లను తొలగించడం అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అజయ్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని మదర్‌థెరిసా కాలనీ, అమరారెడ్డినగర్ కాలనీల్లో ఇరిగేషన్ భూముల్లో 40 ఏళ్లగా నివాసముంటున్న వారికి ఆ శాఖ నోటీసులు ఇచ్చి ఇళ్లను తొలగిస్తామనడం అన్యాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ఆయా కాలనీల్లో ఆయన మంగళవారం పర్యటించారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న పేద ప్రజలకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించిన వారిని న్యాయం చేయాలని అన్నారు. కాలువకట్ట నివాసితులు 5వ వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, పి.గిరిజ, డోగిపర్తి యోహాన్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, తాడేపల్లి మండల కార్యదర్శి మునునూరు సుహాన్, సీపీఐ మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మునగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్ అందజేత

- ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులు రూ.2.50 లక్షలు ఖర్చు
- ఆర్కేకి డీఎంహెచ్ఓ అభినందనలు



ఏఎన్ఎంలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను అందజేస్తున్న డీఎంహెచ్ఓ శ్రావణ్‌బాబు

మంగళగిరి: పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేస్తున్న కృషి అభినందనీయమని డీఎంహెచ్ఓ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులు రూ.2.50 లక్షలతో కొనుగోలు చేసిన వంద బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను నగరంలోని 12 యూపీహెచ్‌సీలకు మంగళవారం డీఎంహెచ్ఓ ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులకు అందజేశారు. గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మాట్లాడుతూ నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దడంలో ఎమ్మెల్యే ఆర్కే చేసిన కృషి అభినందనీయమని చెప్పారు. ఇటీవల నగర పాలక సంస్థ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరిగిన సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి బీపీ డిజిటల్ ఆపరేటర్స్ కొరత ఉందని తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే తన సొంత నిధులు వెచ్చించి అందజేశారన్నారు. నగరంలోని 12 యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ సెంటర్లలోగల 85 మంది ఏఎన్ఎంలకు బీపీ డిజిటల్ ఆపరేటర్స్‌ను అందజేశామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఒ సీహెచ్ రత్నమన్మోహన్, హెల్త్ సెంటర్ మెడికల్ అధికారులు డాక్టర్లు పి అనూష, పి రమేష్, కిరణ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్ భర్తకు టోకరా

మంగళగిరి: మహిళా పోలీస్ కానిస్టేబుల్ భర్తకు సైబర్ నేరగాడు టోకరా వేసిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు... మంగళగిరి మార్కండేయ కాలనీకి చెందిన దివి నాగరాజు, విజయవాడ నగరంలోని ఓ బంగారం షాపులో గుమస్తాగా పని చేస్తుంటాడు. నాగరాజు భార్య తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో నాగరాజుకు కొద్ది రోజుల కిందట ఫోన్‌లో షాపీ స్టోర్ అనే యాప్‌లో పలు వస్తువుల కొనుగోళ్లు– అమ్మకాల ద్వారా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ రూ.లక్షలు సంపాదించుకోవచ్చని ఓ లింకు వచ్చింది. నాగరాజు తొలుత లింకు ఓపెన్ చేసి రూ.వెయ్యి చెల్లించగా రూ.1200 జమ అయ్యాయి. వెంటనే మళ్లీ రూ.1200 చెల్లించగా రూ.2400 జమ అయ్యాయి. ఇలా రెండు మూడు మార్లు జమ కావడంతో ఆశపడ్డ నాగరాజు అధిక మొత్తం చెల్లిస్తూ తొమ్మిది దఫాలుగా రూ.1,67,510 చెల్లించాడు. వాటికి తిరిగి నగదు జమ కాకపోవడంతో సదరు యాప్‌లో ఉన్న ఫోన్‌కు ఫోన్ చేయగా మరో రూ.5లక్షలు చెల్లిస్తే మొత్తం కలిపి జమ చేస్తామని తిరుగు సమాధానం వచ్చింది. మోసపోయానని తెలుసుకుని సోమవారం పట్టణ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాపీ ధర్మారావు చిరస్మరణీయుడు



తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తెనాలి: ప్రజల భాషను అన్నిరంగాల్లో వ్యాప్తి చేయాలనే ధ్యేయంతో జీవితాంతం కృషి చేసిన తాపీ ధర్మారావు చిరస్మరణీయులని సాహితీ ప్రముఖుడు బి.లలితానంద ప్రసాద్ అన్నారు. పట్టణ గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' కార్యాలయంలో అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్తంగా నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో మంగళవారం సాయంత్రం తాపీ ధర్మారావు జయంతిని జరిపారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ రచయితల సంఘం మూలస్తంభాల్లో ఒకరైన తాపీ ధర్మారావు ప్రజల సాహిత్యానికి విశేష ప్రాచుర్యం కల్పించారని చెప్పారు. ప్రజల భాషను సినిమా రంగానికి కూడా తీసుకెళ్లారని చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభలు తెనాలిలో జరిగినపుడు ధర్మారావు అధ్యక్షత వహించినట్టు గుర్తుచేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, కవి అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ పాత్రికేయునిగా, రచయితగా, పరిశోధకుడిగా, సినిమా సంభాషణల రచయితగా, జీవితాంతం కమ్యూనిస్టుగా మెలిగిన తాపీ ధర్మారావు జీవిత విశేషాలను వివరించారు. సభలో ఇస్కఫ్ నాయకులు పి.నారాయణరావు, బొల్లిముంత కృష్ణ, వెనిగళ్ల ప్రసాద్, ఎంవీ రఘునాధరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, విజయదుర్గ, కవి ఆళ్ల నాగేశ్వరరావు, వంగా సుదర్శన రెడ్డి, అంబటి సీతారామయ్య పాల్గొన్నారు. తొలుత తాపీ ధర్మారావు చిత్రపటానికి నివాళులర్పించారు.

తాపీ ధర్మారావుకు నివాళి

తెనాలిఅర్బన్: తెలుగు మాధ్యమాల దినోత్సవాన్ని సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సహజకవి అయిన డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడారు. అనంతరం ఏపీడబ్ల్యూయూజే జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పర సుధాకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, పీవీ అవధాని, లక్కరాజు లక్ష్మణరావు, భీమేశ్వరప్రసాద్, డాక్టర్ తన్నీరు కళ్యాణ్‌కుమార్, అడపా సంపత్‌రాయుడు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



తూములూరులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న మండల వైద్యాధికారిణి లక్ష్మీసుధ

తూములూరు(కొల్లిపర): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని మండల వైద్యాధికారిణి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. గ్రామ సచివాలయంలో పరిధిలో నిర్వహించిన సర్వేను మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురించి వివరించారు. కుటుంబంలో ప్రతి ఒక్కరికీ వైద్య సరీక్షలు చేసి వివరాలు నమెదు చేయాలని సిబ్బందికి సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, కంటి తదితర ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు గుర్తించిన వ్యాధుల తీవ్రతను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్వే ఈనెల 30 వరకు వైద్య సిబ్బంది, వలంటీర్లు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌డీ భారతి, ఏఎన్ఎం దీప్తి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరికి స్వర్ణ పతకాలు



పతకాలు సాధించిన వారితో రామారావు, సాంబశివరావు తదితరులు

తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి క్రీడాకారులకు రెండు బంగారు, ఒక కాంస్య పతకం లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. పోటీలు రేపల్లెలో ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన జి.ప్రభురాజ్, వి.నాగసతీష్, స్నేహలతలను మంగళవారం తెనాలిలోని అకాడమీ ఆవరణలో అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అచ్యుత, సాంబశివరావు, కొత్త రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాల రద్దుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న శివశంకరరావు

తెనాలి: కేంద్ర ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు కోరారు. రైతు సంఘం మండల కమిటీ సమావేశం రూరల్ మండల గ్రామం జగ్గడిగుంటపాలెంలో మంగళవారం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తూ దేశవ్యాప్తంగా రైతాంగానికి ఉన్న రూ.2.5 లక్షల కోట్లను మాఫీ చేయకపోవటం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో రైతుల రుణమాఫీ సమస్యను అజెండాలోకి తీసుకురావాలని కోరారు. తొమ్మిది గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులు, కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 25వ తేదీలోగా రైతుభరోసా కేంద్రాల్లో అర్జీలను ఇవ్వాలని, 25న మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని, రబీ పంటలు వేసుకునేందుకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని కోరారు. ఈనెల 23న తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగే జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు, బొంతా సాంబశివరావు, తాడిబోయిన మాధవరావు, దొడ్డక పుల్లయ్య, నల్లమేకల నాగేశ్వరరావు, గండు వెంకటేశ్వర్లు, కాటిపల్లి వెంకటేశ్వర్లు, ఆదిన గోపి పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడిపై హత్యాయత్నం

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిపై ముగ్గురు యువకులు బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాలు... స్థానిక చెంచుపేట ఓవర్ బ్రిడ్జి డౌన్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సోమవారం సాయంత్రం గండికోట సాంబశివరావు అలియాస్ సాంబపై కొందరు యువకులు బీరు సీసాలతో దాడి చేశారు. గతంలో చెంచుపేటలో జరిగిన రౌడీ షీటర్ మత్తే ప్రశాంత్ హత్య కేసులో సాంబ ఏ2 నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో అరెస్టై ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. వినాయక చవితి పండుగ కావడంతో తెనాలిలో ఉన్న తన సోదరుడిని చూసేందుకని సాంబ పట్టణానికి వచ్చాడు. మధ్యాహ్నం బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం తాగుతుండగా ముగ్గురు యువకులు వచ్చి అతడిపై బీరు సీసాలతో దాడి చేశారు. సాంబ తల, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తీసుకు వెళ్లారు. దాడికి పాల్పడింది గతంలో హత్యకు గురైన మత్తే ప్రశాంత్ స్నేహితులు శ్రీకాంత్, నాగరాజు, మనోహర్‌గా గుర్తించారు. స్నేహితుడి హత్యకు ప్రతీకారంగానే సాంబశివరావుపై హత్యాయత్నం చేసినట్టు తెలుస్తోంది. ముగ్గురు నిందితులు ప్రస్తుతం త్రీ టౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

కల్వర్టు నిర్మాణం పూర్తి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం చింతలపూడి గ్రామంలో సీఎండీఎఫ్, మండల పరిషత్ నిధులతో నిర్మించిన బాక్స్ కల్వర్టు నిర్మాణం మంగళవారానికి పూర్తయింది. గతంలో ఉన్న తూము శృంగిపోయి వర్షాలు పడినపుడు మురుగు పొల్లాలో నిలబడి పంటలు నష్టపోతున్నామని స్థానిక రైతులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో ముంపునీరు వెళ్లేలా ఏర్పాటు చేయించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సీఎండీఎఫ్, మండల పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించి బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చొరవ చూపించారు. బాక్స్ కల్వర్ట్ నిర్మాణం పూర్తికావడంతో చింతలపూడి గ్రామస్తులు, రైతులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు.